చదివింది పాలిటెక్నిక్.. చేసేది చోరీలు
● జల్సాలకు అలవాటు పడి చైన్ స్నాచింగ్ పాల్పడుతున్న యువకుడు
● వృద్ధురాలి కళ్లలో కారం చల్లి పుస్తెలతాడు అపహరణ
● 24 గంటల్లో నిందితుడి పట్టుకున్న పోలీసులు
7

రోడ్డే దిక్కు.. ప్రాణాలకు ముప్పు


రామాయంపేట రోడ్డుపై ఆరబోసిన వడ్లు

రహదారులపైనే ధాన్యం ఆరబోత
కల్లాల కొరతతో తప్పని పరిస్థితి
ప్రమాదాలతో వాహనదారుల్లో భయం
ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని ప్రభుత్వం

గతేడాది నవంబరులోనే మనోహరాబాద్ మండలం పోతారం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. రహదారిపై ధాన్యం ఆరబెట్టడం వలన వాహనాలు ఒకే వైపు నుంచి రాకపోకలు సాగించాల్సి రావడం ఈ ప్రమాదానికి ప్రధాన కారణమైంది.

పదిరోజుల క్రితం రామాయంపేట-అక్కన్నపేట జాతీయ రహదారిపై రైతులు ధాన్యం కుప్పలు ఆరబోయడంతో రెండు ఆటో ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో ఆటోల్లో ప్రయాణిస్తున్న 13 మంది గాయపడ్డారు. వడ్ల కుప్పలను తప్పించబోయే క్రమంలోనే ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

ప్రతీ సీజన్‌లో రోడ్లపై కల్లాలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. అయినా రోడ్లపై కల్లాల ఏర్పాటు ఆగడం లేదు. ఓవైపు తేమ శాతం కోసం ధాన్యం ఆరబోయక తప్పనిసరి పరిస్థితి, మరోవైపు కొనుగోలు కేంద్రాల సమీపంలో కల్లాలు లేని దుస్థితి, దీంతో రోడ్లే దిక్కై, ఈ కల్లాలకు కళ్లెం పడడం లేదు.


అక్కన్నపేట వద్ద రోడ్డుపై వడ్ల ఆరబోతతో ప్రమాదానికి గురైన ఆటో

మెదక్/రామాయంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరి కోతలు ముమ్మరం కావడంతో అన్నదాతలు ధాన్యం ఆరబోతకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడ్లను ఆరబెట్టడానికి మార్కెట్ యార్డులు, గ్రామ పంచాయతీల పరిధిలో సరైన స్థలాలు లేకపోవడంతో రోడ్లనే కల్లాలుగా మార్చుకుంటున్నారు. రోడ్లకు ఓవైపు ఆక్రమించి ధాన్యం ఆరబోశారు. రాత్రివేళ అక్కడే మళ్లీ కుప్ప పేర్చి టార్పలిన్లు కప్పుతున్నారు.

ధాన్యం కుప్పలతో ప్రమాదాలు

రహదారులపై ధాన్యం ఆరబెట్టడం వలన వాహనాలు అదుపు తప్పి, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ధాన్యంపై గుండా ప్రయాణిస్తున్నప్పుడు తరచూ జారిపడి గాయపడుతున్నారు. రాత్రివేళల్లో రోడ్డుపై ధాన్యం కుప్పలు కనిపించకపోవడం వల్ల ఆటోలు, గూడ్స్ వాహనాలు అదుపుతప్పుతున్నాయి. ఈ ప్రమాదాలు వాహనదారుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

కల్లాల కొరతే అసలు సమస్య

రహదారులపై ధాన్యం ఆరబోయడానికి ప్రధాన కారణం కల్లాల కొరతే. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెదక్ జిల్లాలో 1540 ధాన్యం కల్లాలు నిర్మించినప్పటికీ, ప్రభుత్వ నిబంధనల మేరకు వీటిని రైతుల పంట పొలాల్లో మాత్రమే నిర్మించారు. మెదక్ జిల్లాలో చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా ఉండటంతో, కల్లాల కోసం ఐదారు గుంటల్లో కల్లాల నిర్మాణానికి అంగీకరించలేదు. నిర్మించిన చోట కూడా కల్లాలు అంతగా ఉపయోగపడడం లేదు. ఎందకంటే ఆ కల్లాలు ఐకేపీ

మిగతా 8వ పేజీలో

ధాన్యం ఎక్కడో.. తూకం అక్కడే

● నేరుగా మిల్లుకు తరలింపు
● కాయిదంపల్లి ఐకేపీ సిబ్బందికి రైతుల కృతజ్ఞతలు

అల్లాదుర్గం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం ఆరబోసిన చోటనే తూకం వేస్తూ రైతుల కష్టాలను దూరం చేస్తున్నారు కొనుగోలు కేంద్రం నిర్వాహకులు. వివరాల్లోకి వెళితే.. అల్లాదుర్గం మండలంలోని కాయిదంపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని రైతులు కోతల అనంతరం వడ్లను సమీపంలోని రహదారిపై కిలోమీటరు దూరం వరకు ఆరబోశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ధాన్యం తేమ శాతం కలిగి ఉన్న రైతుల వద్దకు నిర్వాహకులే కాంటాతో అక్కడికి చేరుకుని తూకం వేస్తున్నారు. అంతేనా తూకం వేసిన ధాన్యం బస్తాలను కూడా అక్కడి నుంచే మిల్లులకు తరలించే ఏర్పాటు చేశారు. దీంతో శ్రమతో పాటు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించేందుకు ఏర్పాటు చేసే వాహన కిరాయి కూడా ఆదా అవుతున్నదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఐకేపీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలాగే ఇతర కొనుగోలు కేంద్రాల్లోనూ అనుసరిస్తే రైతులకు మేలు చేసినట్లవుతుందని రైతులు పేర్కొంటున్నారు.


అల్లాదుర్గం మండలం కాయిదంపల్లిలో ధాన్యం ఆరబోసిన చోట తూకం వేస్తున్న నిర్వాహకులు


పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో అన్నం పాత్రలో కాలు పెట్టి పడుకున్న వాచ్‌మన్

మద్యం మత్తులో అన్నంలో కాలు

● సంగారెడ్డి పాలిటెక్నిక్ హాస్టల్‌లో వాచ్‌మన్ చర్య
● కలెక్టర్ ఆగ్రహం.. వాచ్‌మన్ సస్పెన్షన్

సంగారెడ్డి రూరల్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): వాచ్‌మన్ అన్నం పాత్రలో కాళ్లు పెట్టి పడుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో చోటు చేసుకున్నది. గురువారం ఈ ఘటన గురించి తెలుసుకున్న కలెక్టర్ ప్రావీణ్య ఆగ్రహం వ్యక్తం చేసి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆయన ఆదేశాలతో పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విద్యాసాగర్ విచారణ చేపట్టారు. వాచ్‌మన్‌గా పనిచేస్తున్న శేఖర్ ఐదు నెలల క్రితం పనిలో చేరాడని, 12వ తేదీన రాత్రి అతిగా మద్యం తాగి డ్యూటీకి వచ్చి, ఆ మత్తులో అన్నం పాత్రలో కాలు పెట్టాడని నివేదించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సదరు వాచ్‌మన్‌ను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సస్పెండ్ చేశారు. ప్రతీరోజు హాస్టల్ పర్యవేక్షించేందుకు ఓ అధ్యాపకుడిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని ప్రిన్సిపాల్‌ను హెచ్చరించారు.

దుప్పట్లు, స్వెటర్ల పంపిణీ


సంగారెడ్డిలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థికి దుప్పటి అందజేస్తున్న ఆర్సీవో రాజేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : 'హస్టళ్లలో గజగజ' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి సంక్షేమ శాఖల జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు సంక్షేమ వసతి గృహాలతో పాటు గురుకులాల్లో ఉండే విద్యార్థులకు దుప్పట్లు, స్వెటర్లు, బ్లాంకెట్లు అందజేశారు. సంగారెడ్డిలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో రీజినల్ కో ఆర్డినేటర్ రాజేశం విద్యార్థులకు బ్లాంకెట్లు అందజేశారు. వట్‌పల్లి మండలం దేవునూరులోని ఎస్సీ బాలుర వసతి గృహ స్వెటర్లు, బ్లాంకెట్లను పంపిణీ చేశారు. కాగా 'ఆంధ్రజ్యోతి' కథనంతో జిల్లా ఉన్నతాధికారులు ఆయా సంక్షేమ శాఖల జిల్లా అధికారుల ద్వారా పరిస్థితిని ఆరా తీశారు.

దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం మన బాధ్యత

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య


సంగారెడ్డిలోని సహారా పునరావాస కేంద్రంలో కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం మన బాధ్యత అని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సంగారెడ్డిలోని సహారా పునరావాస కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సహార లాంటి పునరావాస కేంద్రాలతో మానసిక దివ్యాంగ పిల్లలకు ప్రయోజనం కలుగుతుందని, సంస్థ సేవలు ఎంతో అభినందనీయమన్నారు. డైరెక్టర్లు ప్రతిమారెడ్డి, శంకర్ మాట్లాడుతూ పిల్లల కోసం ఇన్‌క్లూజివ్ స్కూల్, ఆసుపత్రిని త్వరలో ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

చలి పంజా

కనిష్ఠ ఉష్ణోగ్రతల నమోదులో రాష్ట్రంలో రెండో స్థానంలో ఉమ్మడి జిల్లా
సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో అత్యల్పంగా 10.7 డిగ్రీలు నమోదు

మెదక్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. శీతల గాలుల ప్రభావంతో రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోతుండటంతో ప్రజలు వణికిపోతున్నారు. ఈ ఏడాది నవంబరు రెండో వారంలోనే, గత సంవత్సరం డిసెంబర్ మూడో వారంలో నమోదైన ఉష్ణోగ్రతలు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది.

రాష్ట్రంలోనే రెండో స్థానం

గురువారం ఉదయం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 10.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, ఆదిలాబాద్ జిల్లా నేరేడిగొండ (9.5 డిగ్రీల) తర్వాత అత్యంత తక్కువ ఉష్ణోగ్రత నమోదై, ఉమ్మడి మెదక్ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 20వ తేదీ వరకు చలి తీవ్రత మరింత పెరిగే సూచనలు ఉన్నాయి. గడచిన నాలుగు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడంతో ఉదయం, రాత్రి సమయాల్లో పొగమంచు తీవ్రంగా ఉంటోంది. ఉదయం పది గంటలవుతున్నా ఎండలో వేడి పెరగడం లేదు. దీంతో ప్రజలు ఉదయం 8 గంటల వరకూ ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. రోజూవారీ

ఉమ్మడి జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు
గుమ్మడిదలలో 11.0 డిగ్రీలు, ఝరాసంఘంలో 11.2 డిగ్రీలు, కోహీర్‌లో 11.3, కొండపాకలో 11.4, అక్బర్‌పేట్ - భూంపల్లిలో 11.4, హవేళీఘనపూర్‌లో 11.5, రామాయంపేటలో 11.5, కంగ్టిలో 11.5, మర్కుక్‌లో 11.6, రాయపోలులో 11.7, నిజాంపేటలో 11.7, నార్సింగి 11.8, దుబ్బాక 11.9, నంగునూరు 11.9, మనోహరాబాద్‌లో 11.9 డిగ్రీలు నమోదయ్యాయి.


పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరిప్రసాద్ సూచించారు. శీతాకాలంలో శ్వాసకోశ ఇబ్బందులు, సీజనల్ ఫ్లూ జ్వరాలు, వైరల్ ఫీవర్లు పెరిగే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

స్కావెంజర్ నిధుల గోల్‌మాల్!

సర్కారు బడుల్లో కొందరు హెచ్‌ఎంల చేతివాటం
విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు జమ
కోత విధించి స్కావెంజర్లకు చెల్లింపు
సమగ్ర విచారణ చేస్తే బాగోతం బయటకు..

సంగారెడ్డిలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 780 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలకు స్కావెంజర్ నిధులు ప్రతీ నెల రూ.20 వేలు జమవుతాయి. ఇక్కడ ఇద్దరు స్కావెంజర్లను నియమించుకున్నట్టు వారికి, ఒక్కొక్కరికి నెలనెలా రూ.10 వేల చొప్పున చెల్లిస్తున్నట్టు సంతకాలు తీసుకుంటున్నారు. కానీ వారిద్దరికీ రూ.5 వేల మాత్రమే ఇచ్చి, మిగతాది స్వాహా చేస్తున్నట్టు సమాచారం.

ఈ నెల 7న సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ప్రావీణ్య తనిఖీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు శౌచాలయాలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడాన్ని గమనించి సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి స్పాట్‌లోనే సస్పెండ్ చేశారు.

జిల్లా వ్యాప్తంగా చాలా ప్రభుత్వ పాఠశాలల్లో ఇదే రకమైన పరిస్థితి ఉన్నదని తెలుస్తోంది. ముఖ్యంగా పాఠశాల హెచ్‌ఎంలు స్కావెంజర్‌కు ఇవ్వాల్సిన డబ్బుల్లో కోత విధించి ఇవ్వడంతో నియమించుకున్న స్కావెంజర్ అరకొరగా పారిశుధ్య పనులు చేపట్టి వెళ్లి పోతున్నారు.

సంగారెడ్డి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ పనులకు ప్రభుత్వం గతేడాది నుంచి ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ(ఏఏపీసీ)లకు నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. పాఠశాలలో నియమించుకున్న స్కావెంజర్ రోజూ శౌచాలయాలు, మరుగుదొడ్లు, ఆవరణ శుభ్రత, మొక్కలకు నీరు పోయాలి. వీరికి నెలనెలా ఇవ్వాల్సిన డబ్బుల్లో కొందరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిధుల కేటాయింపు ఇలా..
ప్రభుత్వ, జడ్పీ, మోడల్ స్కూళ్లల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కావెంజర్ నిధులు జమ చేస్తున్నది. ఇందులో భాగంగా 1-30 విద్యార్థులకు రూ.3 వేలు, 31-100 ఉంటే రూ.6 వేలు, 101-250 పిల్లలుంటే రూ.8 వేలు, 251-500 ఉంటే రూ.12 వేలు, 501-750 మంది పిల్లలుంటే రూ.15 వేలు, 750 మందికి పైగా పిల్లలుంటే రూ.20 వేలు నిధులు మంజూరు చేస్తుంది. డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఖాతాలో జిల్లా విద్యాశాఖ జమ చేస్తుంది.



నిధుల స్వాహా

పాఠశాలల్లో నియమించుకున్న స్కావెంజర్ నిధుల్లో కొందరు సర్కారు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వం ప్రతీ నెలా జమ చేసే స్కావెంజర్ నిధులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సంయుక్తంగా డ్రా చేసి తిరిగి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్ ద్వారానే స్కావెంజర్‌కు నగదు రూపంలో చెల్లిస్తున్నారు. ఈ విధంగా ప్రతీ నెలా చెల్లించాల్సిన మొత్తంలో నుంచి కోత విధించి కొందరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా నిరక్షరాస్యులైన స్కావెంజర్లను నియమించుకొని తప్పుడు సంతకాలు, వేలిముద్రలు తీసుకొని నిధులు స్వాహా చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఏడాది కాలంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేస్తే నిధులు కోత వ్యవహారం బహిర్గతమయ్యే అవకాశం లేకపోలేదని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులే బాధ్యులు

● ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు
● సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి

ఫటాఫట్



సంగారెడ్డి క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఒకవేళ ఇస్తే వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. అలాగే, జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నివారణకు తీసుకున్న చర్యలను 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

రోడ్లపై వాహనాలు నిలుపకుండా తీసుకుంటున్న చర్యలేమిటి?

పట్టణంలోని అన్ని దుకాణాల యజమానులతో మాట్లాడాం. వారి వద్దకు వచ్చే వినియోగదారుల వాహనాలు నిలుపడం కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసిన చోట వాహనాలు నిలుపరాదు. జరిమానాలు వేస్తాం. గంటకు రూ.100 చొప్పున విధిస్తాం.

హెల్మెట్ ధరించని వారిపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. ప్రమాదాలు జరిగినప్పుడే తలకు గాయం కావడం వల్లనే ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయి. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అలాగే వాహనాలు నడిపే సమయంలో లైసెన్సులు దగ్గర పెట్టుకోవాలి. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తున్నాం.

ట్రాఫిక్ నియంత్రణకు సరిపడా పోలీసులు ఉన్నారా?

ఒక సీఐ, ముగ్గురు ఎస్ఐలు, 22 మంది ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు. రోజురోజుకు పెరుగుతున్న రద్దీ కారణంగా ట్రాఫిక్ సిబ్బంది నియామకం కోసం ఉన్నతాధికారులకు విన్నవించాం.

వింతగా ప్రవర్తిస్తూ.. విగతజీవిగా మారి
భార్యపై దాడి, ఏడాది వయస్సున్న పాపను బిల్డింగ్‌పై నుంచి పడేసిన వైనం
గురువారం రైలు కిందపడి బలవన్మరణం
7

వసతుల 'బడి'
ప్రైవేటుకు దీటుగా కర్కపట్ల ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు

సరిహద్దులో అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

జహీరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : సరిహద్దులో అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి జహీరాబాద్ సరిహద్దులోని చిరాగ్‌పల్లి జాతీయ రహదారిపై సుమారు 80 సిబ్బందితో నాకాబందీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దులో అక్రమ తరలిస్తున్న గుట్కా, రేషన్ బియ్యం, మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల శాంతి భద్రతలో భాగంగా అంతర్ రాష్ట్ర నేరస్తులు, పేలుడు సామాగ్రి జిల్లాలోకి రాకుండా ప్రతి రోజు పలు పోలీస్ స్టేషన్‌లను ఎంపిక చేసి ఆ ప్రాంతంలో వాహనల తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. 850 వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యంను తరలిస్తున్న వాహనదారులను అదుపులోకి తీసుకోవడంతో పాటు మద్యం సేవించి వాహనాలను నడిపిన 9 మంది పై కేసు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీలో అదనపు ఎస్పీ రఘునందన్ రావు, డీఎస్పీ సైదా, జహీరాబాద్ సీఐ శివలింగం, ఆయా మండలాల ఎస్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిరాగ్ పల్లి సరిహద్దులో తనిఖీలో సంగారెడ్డి ఎస్పీ పంకజ్

బీసీ హాస్టల్‌లో గోడలపై ఇంకా పాత వారి పేర్లే

● బదిలీ అయిన కలెక్టర్ క్రాంతి, మాజీ ఉపరాష్ట్రపతి ధన్కర్ పేర్లు దర్శనం
● హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం, విద్యార్థుల తప్పుదోవ



సంగారెడిలోని బీసీ(బి)బాలుర కళాశాల వసతిగృహం గోడకు ఏర్పాటు చేసిన బ్యానర్‌లో దర్శనమిస్తున్న మారిన కలెక్టర్, ఉపరాష్ట్రపతి పేర్లు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఏ శాఖలోనైనా బదిలీ అయిన వారి స్థానంలో కొత్త వారు వస్తే వారి పేర్లు ప్రభుత్వ కార్యాలయాలు, సమాచార హక్కు చట్టం బోర్డుపై ఉంచుతారు. కానీ కొందరు అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులను తప్పుదోవపట్టించేలా ఉన్నది. ఇందుకు సంగారెడ్డిలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్ సమీపంలోని బీసీ(బి)బాలుర కళాశాల వసతి గృహ వార్డెన్ నిర్లక్ష్యం ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నారు. అయితే సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వల్లూరు క్రాంతి బదిలీ కావడంతో ఆమె స్థానంలో గత జూన్ 13 న కొత్తగా ప్రావీణ్య బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా భారత ఉపరాష్ట్రపతి ధన్కర్ స్థానంలో గత సెప్టెంబరులో సీ.పీ.రాధాకృష్ణన్ బాధ్యతలు చేపట్టారు. వీరిరువురు మారినా వీరు పేర్లు మాత్రం ఇంకా ఆ హాస్టల్ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో దర్శనమివ్వడం గమనార్హం. ఇది వసతి గృహ వార్డెన్ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది.

పల్లెల్లో ప్రభుత్వ పాఠశాల అంటే పాత గోడలు, విరిగిన బెంచీలు, శిథిల భవనాలు అన్నది నిన్నటి మాట. అందుకు ముర్కుక్ మండలం కర్కపట్ల ప్రాథమికోన్నత పాఠశాలనే నిదర్శనం. అధునాతన వసతులతో పిల్లల బంగారు భవిష్యత్‌కు నిలయంగా మారుతున్నది ఈ బడి. చల్లని చెట్ల నీడ, చుట్టూ పూలతో ఆహ్లాదకర వాతావరణంతో అందరి చూపును ఆకర్షిస్తోంది. గ్రామస్థుల సహకారం, ఫార్మా కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం, పాఠశాల సిబ్బంది, నేతల కృషితో ఈ బడి ఆదర్శంగా నిలుస్తున్నది



పాఠశాలలో నిర్మించిన డైనింగ్‌హాల్



బాలికల టాయిలెట్స్

వసతుల బడి

ప్రైవేటుకు దీటుగా కర్కపట్ల ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు

- గ్రామస్థులు, ఫార్మా సంస్థల భాగస్వామ్యంతో ఆధునిక రూపు
- విద్యార్థులకు నిత్యం గుడ్డు, అరటిపండు అందజేత
- ఆరుగురు వలంటీర్లతో తరగతికో ఉపాధ్యాయుడు
- డిజిటల్ క్లాస్‌రూమ్ ఏర్పాటుకు ప్రధానోపాధ్యాయుడి విజ్ఞప్తి



పాఠశాల ప్రాంగణంలో చెట్ల చుట్టూ నిర్మించిన దిమ్మెలు



పరిశుభ్ర వాతావరణంలో విశాలమైన వాష్ ఏరియా

మర్కుక్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని కర్కపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రస్తుతం 121 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. బడి ప్రాంగణంలో చల్లని నీడ నిచ్చే పెద్ద చెట్లు, దాని చుట్టూ దిమ్మెలు ఏర్పాటు చేసి విద్యార్థులు కూర్చోవడానికి అనువుగా తీర్చిదిద్దారు. ఇక్కడ పెంచిన మొక్కలు కేవలం నీడకే కాక, పిల్లలకు పర్యావరణ ప్రేమను కూడా నేర్పుతున్నాయి.

సకల సౌకర్యాలు

ఆధునిక వసతులు, పౌష్టికాహారం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మినరల్ వాటర్ సౌకర్యాన్ని కల్పించారు. శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉంచారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు కొన్ని ప్రభుత్వ భవనాలు ఉండగా, మరికొన్ని అధునాతన తరగతి గదులను ఫార్మా కంపెనీల సీఎస్ఆర్ నిధులతో నిర్మించడం విశేషం. బాలురు, బాలికలకు వేర్వేరుగా పరిశుభ్రమైన టాయిలెట్లను నిర్మించారు. పాఠశాల ప్రగతికి ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఉపాధ్యాయులు రవినాయక్, భాగ్యలక్ష్మి, స్థానిక యువ నాయకులు ఎంతగానో కృషి చేస్తున్నారు. హెచ్‌ఎం నిత్యం పరిశుభ్రతను తనిఖీ చేస్తారు.

విద్యా వలంటీర్ల నియామకం..

తరగతికి ఒక ఉపాధ్యాయుడు తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ప్రధానోపాధ్యాయుడు మల్లేశం సూచించగా, కంపెనీల సహకారంతో ఆరుగురు విద్యా వలంటీర్‌లను నియమించారు. ఒక్కొక్కరికి నెలకు రూ.15,000 జీతాన్ని కంపెనీలే అందజేస్తున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులు, వలంటీర్లు సమన్వయం చేసుకుంటూ నిబద్ధతతో కూడిన ఉపాధ్యాయ బృందం ఊరి బడిని సజావుగా నడిపిస్తోంది.

డిజిటల్ తరగతులు అవసరం..



ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు చాలా అవసరం. ప్రభుత్వం 8వ తరగతి నుంచి ఒక్కొక్క తరగతికి ఒక్కొక్క ప్యానల్‌ను సమకూర్చింది. కానీ, ఈ పాఠశాలలో ఏడవ తరగతి వరకే ఉంది కాబట్టి, ప్రభుత్వ ప్యానెల్ రాలేదు. ఫార్మా యాజమాన్యాలు స్పందించి డిజిటల్ తరగతుల కోసం ప్రొజెక్టర్లు, ప్యానెల్‌ను సమకూర్చాలి.

- మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు

విశాలమైన డైనింగ్ హాల్..

గతంలో విద్యార్థులు గడ్డిపై లేదా మట్టిలో కూర్చుని భోజనం చేసేవారు. కానీ, ఇప్పుడు విశాలమైన డైనింగ్ హాల్ ఏర్పాటు చేయడంతో పద్ధతిగా భోజనం చేస్తున్నారు. ప్రభుత్వం తరఫున వారానికి మూడు కోడిగుడ్లు ఇస్తుండగా, ఫార్మా కంపెనీల నుంచి మరో మూడు రోజులు గుడ్డు అందిస్తున్నారు. ప్రతి రోజు కంపెనీల సహకారంతో మధ్యాహ్నం అరటిపండు కూడా ఇస్తున్నారు. దీంతో ఆ పాఠశాలలో ప్రతిరోజు ఒక కోడిగుడ్డు, రెండు రకాల కూరలు, ఒక అరటిపండు విద్యార్థులకు అందుతున్నాయి.



క్రైం కార్నర్

వింతగా ప్రవర్తిస్తూ.. విగతజీవిగా మారి..

- మూడు రోజులుగా మతిస్థిమితం కోల్పోయి వ్యక్తి వింతగా ప్రవర్తన
- భార్యపై దాడి, ఏడాది వయస్సున్న పాపను బిల్డింగ్‌పై నుంచి పడేసిన వైనం
- గురువారం రైలు కిందపడి బలవన్మరణం



రైలు పట్టాలపై శంకర్ మృతదేహం

తూప్రాన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తిస్తున్న ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూప్రాన్ పట్టణ పరిధిలోని వెంకటాపూర్(పీటీ)కి చెందిన అంగడిశంకర్(52) కూలి పనులు చేసుకుంటూ భార్య అనితతో కలిసి జీవించేవాడు. శంకర్ కల్లు, మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు వారించడంతో వారం రోజులుగా అతను మద్యం తాగడం మానేశాడు. అయితే, కల్లు మానేయడం వల్లనో, మరో కారణమో కానీ మూడు రోజులుగా శంకర్ మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. దీంతో కుటుంబ సభ్యులు పూజలు చేయించి, మంత్రాలు వేయించినా ఫలితం దక్కలేదు. బుధవారం తనపై ఎవరో ఏదో చేస్తున్నారని గొడవ పడుతూ శంకర్ తన భార్య అనితపై రాడ్‌తో దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా, అక్కడే ఉన్న తన అన్న సత్తయ్య కుమారుడు మనుమరాలు ఏడాది పాపను బంగ్లాపైకి తీసుకెళ్లి కిందకు తోసేశాడు. గాయపడిన భార్య అనితను, చిన్నారిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న శంకర్ రాత్రంతా పలువురి ఇండ్ల తలుపులు బాదుతూ గడిపినట్లు స్థానికులు తెలిపారు. గురువారం ఉదయం శంకర్ సమీపంలోని బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో పట్టాలపై శవమై కనిపించాడు. మతిస్థిమితం కోల్పోయిన శంకర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం లోడ్ ట్రాక్టర్ బోల్తా

- తప్పిన పెను ప్రమాదం



బోల్తా పడిన ట్రాక్టర్

హుస్నాబాద్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం తోటపల్లి సమీపంలో ప్రధాన రహదారి పక్కన ధాన్యం బస్తాల లోడ్ ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. గురువారం అక్కన్నపేట మండలం పంతులుతండా నుంచి కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని హుస్నాబాద్ మండలంలోని రైస్‌మిల్‌కు తరలిస్తున్నారు. తోటపల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయిన డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో లోడ్ బస్తాల ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్ అక్కడే ఉన్న విద్యుత్ స్తంభంపై పడడంతో అది విరిగిపోయింది. అయితే, సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

వాగులోకి దూసుకెళ్లిన కారు

- తృటిలో తప్పిన ప్రమాదం
- ముగ్గురికి స్వల్ప గాయాలు



కలివేముల వాగులోకి దూసుకెళ్లిన కారు

కంది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా కారు అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లిన సంఘటన కంది మండల పరిధిలోని కలివేముల గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలం తోపుగొండ గ్రామానికి చెందిన గొల్లగూడెం సురేష్, అతని అన్న మల్లేశం, వదిన లక్ష్మిలతో కలిసి గురువారం ఉదయం సంగారెడ్డిలో ఒక వివాహానికి తమ కారులో వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో కలివేముల వద్ద మూలమలుపు తిరుగుతుండగా కారు అదుపుతప్పి ఒక్కసారిగా వాగులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు ముగ్గురిని బయటకు తీసి, చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. తరచుగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ఆర్ అండ్ బీ అధికారులు వంతెనకు రక్షణ గోడలు నిర్మించాలని కలివేముల గ్రామస్థులు కోరుతున్నారు.

కుళ్లిన గుడ్ల పంపిణీపై విచారణ



అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వ ఉన్న గుడ్లను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

హత్నూర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో కుళ్లిన గుడ్లు అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శీలావతి ముచ్చర్ల అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ చిన్నారలుఉ, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసేందుకు నిల్వ ఉంచిన గుడ్లను పరిశీలించారు. అదేవిధంగా ఇదివరకు కుళ్లిన గుడ్లు సరఫరా అయిన గర్భిణులు, చిన్నపిల్లల తల్లులతో ప్రత్యేకంగా మాట్లాడి పలు వివరాలు సేకరించారు. వారికి కుళ్లిన గుడ్ల స్థానంలో అదనంగా గుడ్లు ఇప్పించారు. విధి నిర్వహణలో టీచర్లు సక్రమంగా పని చేయాలని సూపర్‌వైజర్ శీలావతి సూచించారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



ప్రతిభ కనబర్చిన సానియా సదా

సిద్దిపేట కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :టీ శాట్ స్టూడియో, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలో సిరిసిల్ల జోన్ జట్టు ప్రథమ బహుమతి సాధించింది. కాగా ఈ జట్టుకు సిద్దిపేట ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సానియా సదా నేతృత్వం వహించింది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఆన్వెల్ స్టూడెంట్ కాంపీటిషన్‌లో భాగంగా జరిగిన కార్యక్రమంలో విజేతగా నిలిచిన జట్టుకు మంత్రి శ్రీధర్ బాబు మెమెంటో అందజేశారు. విద్యార్థిని సానియా సదాను ఇందిరానగర్ ప్రధానోపాధ్యాయుడు రాజ ప్రభాకర్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఫ్రీ కోచింగ్‌కు దరఖాస్తులు

- ఈ నెల 20 నుంచి తరగతులు ప్రారంభం
- మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మెదక్ అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతలకు ఉచిత కోచింగ్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుపేద, గ్రామీణ యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఈ క్యాంపులో అభ్యర్థులకు పోలీసు, ఆర్మీ, రైల్వే, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఎస్ఐ, కానిస్టేబుల్‌తోపాటు ఇతర ప్రభుత్వ రంగ పోటీ పరీక్షలకు అవసరమైన పాఠ్యబోధన, ఫిజికల్ ట్రైనింగ్, మాక్ టెస్టులు, కౌన్సెలింగ్ వంటి ప్రేరణాత్మక సదస్సులు ఉంటాయన్నారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, పోలీసు అధికారులు, ట్రైనర్ల ద్వారా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల యువత నుంచి ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 20 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. నిరంతర పర్యవేక్షణలో శిబిరం కొనసాగుతోందన్నారు. అభ్యర్థులు, క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో పాల్గొని తమ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిగితా వివరాలకు ఫోన్ 8712529742, 7893924601 నంబర్లను సంప్రదించాలన్నారు.



పాడైన బోరు వద్ద వాటర్ బాటిళ్లతో విద్యార్థులు

విద్యార్థులకు తాగునీటి కష్టాలు

- పాఠశాల ఆవరణలో పాడైన బోరు
- 8 నెలలైనా మరమ్మతులకు నోచుకుని వైనం
- ఇంటినుంచే నీటి బాటిళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు

కోహీర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గత 8 నెలలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో 169 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం పాఠశాల ఆవరణలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోరు ఎనిమిది నెలలుగా చెడిపోయి ఉంది. దీంతో విద్యార్థులకు తాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా, మధ్యాహ్న భోజనం వండేందుకు కూడా నీరు దొరకని పరిస్థితి ఏర్పడింది. బోరు పాడవ్వడంతో విద్యార్థులు వారి వారి ఇళ్ల నుంచే వాటర్ బాటిల్‌లలో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు సైతం గ్రామంలోకి వచ్చి బిందెలతో నీరు తీసుకువచ్చి వంట చేయాల్సి వస్తోంది. తాగునీటి ఇబ్బంది ఇంత తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. పాడైన బోరును బాగు చేయించాలని సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి, తాగునీటి బోరును బాగు చేయించి విద్యార్థుల కష్టాలు తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చదివింది పాలిటెక్నిక్.. చేసేది చోరీలు

- జల్సాలకు అలవాటు పడి చైన్ స్నాచింగ్ పాల్పడుతున్న యువకుడు
- వృద్ధురాలి కళ్లలో కారం చల్లి పుస్తెలతాడు అపహరణ
- 24 గంటల్లో నిందితుడి పట్టుకున్న పోలీసులు

జోగిపేట రూరల్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి):పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యాధికుడు.. జల్సాలకు అలవాటు పడి చైన్ స్నాచింగ్ చేయడం మొదలు పెట్టి పోలీసులకు దొరికాడు. జోగిపేట పట్టణంలో వృద్ధురాలి మెడలోంచి పుస్తెల తాడు చోరీకి ఒగుంరైన సంగతి విదితమే.. ఈకేసులో 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకుకుని రిమాండ్‌కు తరలలించినట్లు జోగిపేట సీఐ అనిల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జోపేఏటలోని తన కార్యాలయంలో.. ఎస్ఐ పాండుతో కలిసిఈకేసుకు ససంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన జనుముల నవీన్(37) సివిల్ ఇంజనీరింగ్‌లో పాలిటెక్నిక్ పూర్తి చేసి, పటాన్‌చెరులోని ఓప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ.... తన భార్య పిల్లలను పోషిస్తున్నాడు. అయితే జల్సాలకు అలవాటు పడ్డ నవీన్‌కు తన ఉద్యోగం ద్వారా వచ్చే జీతం సరిపోకపోవడంతో దొంగతనాలు, ముఖ్యంగా చైన్ స్నాచింగ్ చేయడం మొదలు పెట్టాడు. ఇదే సమయంలో.. బుధవారం జోగిపేటకు వచ్చిన నిందితుడు నవీన్... కంట్లో శంకరంపేట మాణెమ్మ.. తన నెలవారీ మందుగోళీల కొనుగోలు కోసం వచ్చి ఇంటికి వెళ్తున్న విషయాన్ని గమనించి ఆమెను వెంబడించాడు. అయితే, సదరు మాణెమ్మ ఇంట్లోకి వెళ్ళి... మందులు ఇంట్లో పెట్టి.. చిన్న గేటు వద్ద ఆరు బయట ఎండకు కూర్చున్న విషయాన్ని గమనించిన నవీన్... వేగంగా గేటు తీసి లోపలికి వచ్చి.. మాణెమ్మ కళ్ళల్లో కారం చల్లి....ఆమె మెడలోంచి పుస్తెల తాడును లాగాడు. ఈక్రమంలో ఇద్దరికీ పెనుగులాట జరిగి, మాణెమ్మ మెడ, వీపుపై గాయాలయ్యాయి. ఇంతలో మాణెమ్మ అరవడంతో ఇంట్లోనే లోపలి గదిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆమె కూతురు బయటికి వచ్చి.. నవీన్‌ను నిలువరించే ప్రయత్నం చేయగా, ఆమెను విసురుగా తోసిన నవీన్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈవిషయాన్ని తెలుసుకున్న సీఐ అనిల్, ఎస్ఐ పాండు, సంఘటనాఆ స్థలానికి వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని గురువారం ఉదయం పట్టుకుని తమదైన శైలిలో విచారించగా, పుస్తెల తాడు చోరీ విషయాన్ని సదరు నిందితుడు ఒప్పుకున్నాడు. ఈమేరకు నిందితుడు జనుముల నవీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు, అతని వద్దనుంచి బంగారాన్ని రికవరీ చేసినట్టు సీఐ అనిల్ వివరించారు.



శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే సతీమణి అనుపమారెడ్డి

కార్తీక దీపోత్సవం

- ఘనంగా శివపార్వతుల కల్యాణం

నారాయణఖేడ్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకొని నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం ఆవరణలో గురువారం కనుల పండుగగా కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం నిర్వహించిన అనంతరం మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. స్థానిక ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డితో కలసి శివపార్వతుల కల్యాణోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్, శ్రీపంతులు, మోహన్‌పంతులు తదితరులు హాజరయ్యారు.

న్యూస్ బాక్స్

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

మనోహరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో రవిందర్ అన్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని రైతువేదికలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మెహతాబేగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, లీగల్ అడ్వకేట్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలి'

మనూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో చంద్రశేఖర్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని తిమ్మాపూర్, శెల్గిరా, దుద్గగొండ, రాణాపూర్, మాయికోడ్ గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో షాయిద్ ఉన్నారు.

ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి

రాయికోడ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షణ ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని కంప్యూటర్ ఆపరేటర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌చారి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని సమగ్ర శిక్షణ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

నేడు వాహనాలకు వేలం

సంగారెడ్డి క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ ఎన్‌డీపీఎస్ కేసుల్లో పట్టుబడిన నాలుగు వాహనాలకు శుక్రవారం వేలం వేయనున్నట్టు ఎక్సైజ్ సీఐ ఎండీ.నజీర్‌పాష ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు. సంగారెడ్డిలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో ఈ వేలం జరుగుతుందని తెలిపారు.

16 నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభం

పటాన్‌చెరు నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరానికి సంబంధించిన తరగతులు ఈనెల 16 నుంచి ప్రారంభిస్తున్నామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వడ్లురి శ్రీనివాస్, కోఆర్డినేటర్ నోముల యోగిబాబులు చెప్పారు. 15న ఓరియంటేషన్ కార్యక్రమం ఉంటుందని వివరించారు. కొత్తగా చేరిన విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

నర్సాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ డిపార్టుమెంటులో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు విమర్శించారు. గురువారం మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ 4వ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

వ్యాయామంతో మధుమేహం నివారణ

నిజాంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో మధుమేహ వ్యాధిని నివారించవచ్చని ఆరోగ్యమే మహాభాగ్యం సభ్యులు తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఓపెన్ జిమ్ వద్ద గురువారం లయన్స్ క్లబ్ రామాయంపేట సహకారంతో ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు

కల్హేర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తామని నారాయణఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) నూతన్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని రాపర్తి, క్రిష్ణాపూర్ గ్రామాల్లో గురువారం ధాన్యం, మొక్కజొన్న కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు.

రాయిపల్లిలో బాలల దినోత్సవం

మనూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : యూత్ ఫర్ హ్యూమానిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని రాయిపల్లిలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో రాజశేఖర్, ఎస్ఐ కోటేశ్వర్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

వ్యక్తికి రిమాండ్

వెల్దుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద నిలిపి ఉన్న బైక్‌ను దగ్ధం చేసిన కేసులో నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా, 14 రోజుల రిమాండ్ విధించినట్లు తూప్రాన్ సీఐ రంగాకృష్ణ తెలిపారు. వెల్దుర్తి మండల పరిధిలోని కుకునూర్ గ్రామంలో ఆదివారం రాత్రి బానాపూరం నర్సింలుకు చెందిన బైక్ ఇంటి ముందు నిలిపి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బైక్‌ను దగ్ధం చేసింది.. బానాపురంకు చెందిన వ్యక్తిగా పేర్కొన్నారు.

నిర్లక్ష్యం వీడకపోతే ప్రజాగ్రహమే : మహిపాల్‌రెడ్డి

- 17 గ్రామాలకు మూడు నెలలుగా తాగునీరు ఏది
- నీటి పారుదల శాఖ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



గ్రామీణ, నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వీడకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావల్సి ఉంటుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో గ్రామీణ నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంద్రేశం పురపాలక పరిధిలో గ్రామాలకు మూడునెలలకు ఒకసారి తాగునీటిని సరఫరా చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వాయర్లలో నీల్లు నిండుగా ఉండగా సరఫరా చేసేందుకు మీకు వచ్చిన ఇబ్బందులు ఏమున్నాయంటూ నిలదీశారు. పరిస్థితులు ఇలా కొనసాగిస్తానంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని అధికారులను హెచ్చరించారు. 17 గ్రామాల్లో రెండేళ్లుగా తాగునీటిని సక్రమంగా సరఫరా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటిని సరఫరా చేయకపోతే ప్రజాప్రతినిధులకు చెడ్డ పేరు రావడమే కాకుండా ప్రభుత్వం అప్రతిష్టపాలవుతుందని చెప్పారు. పాశమైలారం పరిశ్రమలకు మాత్రం నిరాటంకంగా నీటిని సరఫరా చేస్తున్నారని తెలిపారు. నిధుల విషయంలో ఇబ్బందులుంటే చెప్పండి... తాను సొంతంగా సీఎస్ఆర్ కింద నిధులు ఇస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో నిర్దేశించిన సమయాలకు తప్పనిసరిగా తాగునీటిని సరఫరా చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రఘువీర్, ఈఈ విజయలక్ష్మి, డిఈలు హరీశ్, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్ తదితరులు ఉన్నారు.

రద్దయిన రూ.22 కోట్లు మంజూరు చేయాలి

పటాన్‌చెరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రేశం రోడ్డు వేయడానికి గత ప్రభుత్వంలో మంజూరైన రూ.22 కోట్లను విడుదల చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఇంద్రేశం పట్టణంలో రూ.60 లక్షలతో చేపడుతున్న రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించి మాట్లాడారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు : ఎమ్మెల్యే



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

హవేళిఘణపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విడతలవారీగా అర్హులందరికీ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. గురువారం మండలంలోని చౌట్లపల్లి, శమ్నాపూర్, గంగాపూర్ గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ గౌడ్, నాయకులు చంద్రశేఖర్, పోశెట్టి, శ్రీనివాస్ రాము పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలి

- ప్రిన్సిపల్స్‌కు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ఏ విద్యార్థి నష్టపోకుండా ఉపకార వేతనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో, వసతి గృహ సంక్షేమాధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు ప్రిన్సిపల్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, వాటిని విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూపంలో ఇవ్వకపోవడం శోభనీయమన్నారు. చదువుకునే పేద పిల్లలకు ప్రభుత్వం అందించే ఉపకార వేతనం అండగా ఉంటుందన్నారు. 2025-26 సంవత్సరానికి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పునరుద్ధరణ (రెన్యూవల్), ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన పెండింగ్, నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియతోపాటు విద్యార్థుల బయోమెట్రిక్ పూర్తి చేయాలని సూచించారు. గడువులోగా హార్డ్ కాపీలను సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలన్నారు. విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో సత్వర చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి : డీపీవో



పెద్దశంకరంపేట గ్రామపంచాయతీలో మాట్లాడుతున్న యాదయ్య

పెద్దశంకరంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని మెదక్ జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. గురువారం పెద్దశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను కార్యదర్శులు వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ గృహాల పనులు, తాగునీటి సరఫరా, గ్రామాల అభివృద్ధికి సంబంధించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సమావేశంలో డీఎల్పీవో సురేష్‌బాబు, ఎంపీడీవో షాకీర్‌అలీ, ఎంపీవో క్రాంతికుమార్, పంచాయతీ కార్యదర్శులు వెంకటరాములు, జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

సర్వే విధుల ఎన్యూమరేషన్ చెల్లించండి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కంబాపురం అశోక్

నారాయణఖేడ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే విధులు నిర్వర్తించిన సూపర్‌వైజర్లకు రూ.12 వేలు, ఎన్యుమరేటర్లకు రూ.10 వేల చొప్పున చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కంబాపురం అశోక్, ఉపాధ్యక్షుడు కాశీనాథ్ జాదవ్ డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ ఖేడ్ మండల శాఖ మహాసభను గురువారం మండల అధ్యక్షుడు ఏసుదాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో పోరాటానికి సిద్ధం కావాల్సి వచ్చిందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శులు ఏసప్ప, నరేష్, నర్సయ్య, హరిసింగ్, ఖేడ్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో రైతులకు సహకరించాలి : దేవ్‌కుమార్

రామాయంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు రైతు సమస్యలపై క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ సూచించారు. రామాయంపేట గురువారం డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనిలో రామాయంపేట, నార్సింగి, చేగుంట నిజాంపేట మండలాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి గురైన బైక్ శివారులో లభ్యం

నిజాంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చోరీకి గురైన ద్విచక్ర వాహనం లభ్యమైంది. ఎస్ఐ రాజేష్ వివరాల ప్రకారం.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కంది అభిలాష్ తన (టీఎస్ 35 0567) నంబరు గల ద్విచక్ర వాహనాన్ని మిర్చి మిల్ వద్ద నిలిపేసి, పొలానికి వెళ్లి వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. గురువారం సాయంత్రం గ్రామ శివారులోని మావురం రాజు వ్యవసాయ బావి వద్ద ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు అక్కడికి వెళ్లి తెచ్చుకున్నాడు.

ఆదర్శ పాఠశాల జిల్లాలో మొదటిస్థానం సాధించాలి

- విద్యార్థులకు ఆర్జేడీ సూచన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయలక్ష్మి

మునిపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మునిపల్లి ఆదర్శ పాఠశాల జిల్లాలో మొదటిస్థానం సాధించాలని హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) విజయలక్ష్మి అన్నారు. గురువారం పాఠశాలలోని తరగతి గదులు, లైబ్రరీ, మధ్యాహ్న భోజనం, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ కోర్సు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తరగతులను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సంగారెడ్డి జిల్లా కార్యదర్శి లింబాజి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లిక ఉన్నారు.

పోడు రైతులకు న్యాయం చేయండి

- ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పోడు రైతులపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలు ఆపాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి చెప్పారు. గురువారం రామచంద్రాపురంలో విలేకరులతో మాట్లాడారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట అటవీశాఖ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన రైతులపై అధికారులు విరుచుకుపడ్డారని వివరించారు. పట్టాలు ఇవ్వకపోగా చేతులకు బేడీలు వేసి ఇష్టారీతిన వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు పూర్తి మద్దతు తెలుపుతున్నామని వివరించారు. అలాగే రైతులు పండించిన మక్కలను కొనుగోలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖను గురువారం చూపారు.

బాలల విద్య, వికాసం కోసం కృషి చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న సౌజన్య

సంగారెడ్డి క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలల విద్య, వికాసం, ఆరోగ్య, భద్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య కోరారు. సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్‌లో స్కోప్ ఎన్జీవో ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పిల్లలతో సంప్రదింపుల శిబిరం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రతీ పిల్ల వాడికి విద్యా రక్షణ, ప్రేమ, గౌరవం లభించే హక్కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, పోలీసు, ఇతర శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు గురుకుల విద్యార్థులు

కోహీర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ రాములు, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట/కల్హేర్/మునిపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట పట్టణానికి చెందిన సాత్విక్, రాజేష్‌కు రూ.12 వేలు, లలితకు రూ.17500, వీరోజిపల్లికి చెందిన భాస్కర్‌కు రూ.13 వేలు, సిర్గాపూర్ గ్రామానికి చెందిన పద్మకు రూ.21 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, కల్హేర్ మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే కల్హేర్ మండల క్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన దాడె బాలయ్య భార్య ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును భూపాల్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ.అలీ, నాయకులు పాల్గొన్నారు. మునిపల్లి మండలం పెద్దగోపులారం గ్రామానికి చెందిన మ్యాతరి మల్లమ్మ భర్త మాణిక్యరావుకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎంపీటీసీ బుర్కల పాండు గురువారం అందజేశారు.

సామాజిక న్యాయం కోసం ధర్మదీక్ష



సంగారెడ్డిలో ధర్మ దీక్ష చేపట్టిన బీసీ జేఏసీ నాయకులు

సంగారెడ్డి రూరల్/రామాయంపేట/చేగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సామాజిక న్యాయం కోసమే ధర్మదీక్ష చేపట్టామని బీసీ జేఏసీ చైర్మన్ ప్రభుగౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ నాయకులు చేపట్టిన ధర్మ దీక్ష బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పుష్ప నగేష్‌యాదవ్, జేఏసీ నాయకులు కృష్ణ, రమేష్, మల్లికార్జున్ పాటిల్, కూనవేణు పాల్గొన్నారు. రామాయంపేటలో బీసీలు ర్యాలీగా తరలివచ్చి మెదక్ చౌరస్తా వద్ద ఒకరోజు దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మెట్టు గంగారం, పొలిటికల్ బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ పట్నం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. నార్సింగి మండల కేంద్రంలోని ఎస్బీఐ చౌరస్తా వద్ద బీసీ నాయకులు ధర్మ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి యాదగిరియాదవ్ మాట్లాడారు.

రోడ్లే దిక్కు.. ప్రాణాలకు ముప్పు

(5వ పేజీ తరువాయి)

కేంద్రాలకు దూరంగా, పంట క్షేత్రాల వద్ద ఉండటమే కారణం. అంత దూరముంటే కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసే సమయానికి కేంద్రాలకు తరలించడం కష్టమవుతుంది. అందుకే ముందే కేంద్రాల వద్దకు తరలించి సమీపంలోని రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్నారు.

పోలీసు కేసులు, హెచ్చరికలు

రహదారులపై ధాన్యం ఆరబోయడం చట్టవిరుద్ధమని, ప్రత్యామ్నాయాలు ఎంచుకోవాలని పోలీసులు రైతులకు సూచిస్తున్నారు. ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రహదారులపై ధాన్యం ఆరబోసే రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే, అక్కన్నపేట శివారులో జరిగిన ఆటో ప్రమాదాలకు కారకుడంటూ రైతుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పరిష్కారం ఏదీ?

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఏటా పంట కోత సీజన్‌లో గ్రామ పంచాయతీలు, మార్కెట్ యార్డుల్లో తాత్కాలిక కల్లాలు లేదా ఆరబోత స్థలాలను కేటాయించాలని రైతులు, వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలలో తడి ధాన్యం సేకరణకు నిరాకరిస్తుండటంతో, తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపైనే ఆరబోయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

తపస్ ఆధ్వర్యంలో 'కాళోజీ' వర్ధంతి



చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణరావు వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

చేగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తపస్ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ సాధనకు ఆయన కృషిచేశారని, తన రచనలతో ప్రజలను సత్యం వైపు నడిపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్, తపస్ మండల అధ్యక్షుడు రావుల వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జుల్‌కల్‌లో మంజీరా పైప్‌లైన్ లీజేజీ

కంది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని జుల్‌కల్ శివారులో హైదరాబాద్‌కు సరఫరా అవుతున్న మంజీరా పైప్‌లైన్ లీకై కొన్నిరోజులుగా నీరంతా వృథాగా పోతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నీరు మూలంగా బీటీరోడ్డు పాడవడంతో పాటు పంట పొలాల్లోకి నీరు వస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై నీటిపారుదలశాఖ లైన్‌మెన్ జానయ్యను గురువారం 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మరమ్మతులు చేయాలంటే సదాశివపేట మండలంలోని పెద్దపూర్ ఫిల్టర్ బెడ్ నుంచి హైదరాబాద్ వరకు నీటి సరఫరాను పూర్తిగా నిలిపేయాల్సి వస్తుందన్నారు. అందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. అనుమతి రాగానే మరమ్మతులు చేపడతామని ఆయన తెలిపారు.

అయ్యప్పస్వాముల పాదయాత్రలో మహేశ్వరశర్మ సిద్ధాంతి



తమిళనాడు రాష్ట్రంలోని వేదసందూర్‌లో అయ్యప్పస్వాముల పాదయాత్రలో మహేశ్వరశర్మ సిద్ధాంతి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి నుంచి శబరిమలకు బయలుదేరిన అయ్యప్పస్వాముల బృందాన్ని తమిళనాడు రాష్ట్రంలోని వేదసందూర్ వద్ద శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి కలిశారు. సాహితిరాము గురుస్వామి ఆధ్వర్యంలో శబరిమలకు బయలుదేరిన స్వాములు ఇప్పటివరకు 1250 కి.మీ పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా సిద్ధాంతి వారిని అభినందించారు. మరో 250 కి.మీ పాదయాత్ర ప్రయాణం పూర్తి చేసుకొని దిగ్విజయంగా సంగారెడ్డికి చేరుకోవాలని సిద్ధాంతి అయ్యప్పస్వాముల బృందానికి ఆశీస్సులు అందజేశారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

పటాన్‌చెరు నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో పన్నులు చెల్లించి జరిమానాలు పడకుండా చూసుకోవాలని ఐడీఏబొల్లారం మున్సిపల్ కమిషనర్ కిషన్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అమర్‌ల్యాబ్, ఇమాంబక్షి పరిశ్రమల ప్రతినిధులు రూ.4.70 లక్షలు పన్నుల రూపంలో చెల్లించారు. అనంతరం బిల్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్వో నర్సింలు, మేనేజర్ మల్లికార్జున్‌స్వామి, ఏఈ కిష్టయ్య పాల్గొన్నారు.

చేగుంటలో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

మనోహరాబాద్/చేగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని షాపులు, హోటళ్ల, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాల్లో పరిసరాల్లో నార్కోటిక్ డాగ్‌స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ నారాయణగౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పసిరుద్దీన్, సిద్ధిరాములు, శ్రావణ్, సంపత్ పాల్గొన్నారు. అలాగే చేగుంట పట్టణంలోని రైల్వేస్టేషన్ పలు దాబాలు, దుకాణాల్లో నార్కోటిక్ డాగ్‌స్క్వాడ్ బృందం తనిఖీ చేపట్టింది. ఇందులో ఏఎస్ఐ శ్రీనివాస్, నార్కోటిక్ డాగ్‌స్క్వాడ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతారం జాతర

మునిపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం అంతారం గ్రామంలో జీవనమ్ముక్త మహరాజ్ జాతర ఈనెల 14 నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని కమిటీ సభ్యులు, గ్రామస్థులు విద్యుదీపాలతో అలంకరించారు. నేడు స్వామి జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ పీఠాధిపతి జ్ఞానేశ్వర్(బాల్‌రాజ్) మహరాజ్ తెలిపారు.

రోడ్డు ధ్వంసంపై గ్రామస్థుల ఆందోళన

మనూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట నుంచి బీదర్ వరకు నిర్మిస్తున్న 161 జాతీయ రహదారి పనుల వల్ల మనూరు మండల పరిధిలోని దోసపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు ధ్వంసమైంది. దీంతో గ్రామస్థులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ రోడ్డుపై టిప్పర్లు వెళ్లడంతో రోడ్డంతా పాడైపోతుందన్నారు. అయితే కాంట్రాక్టర్ తరఫున పలువురు వచ్చి గ్రామస్థులను సముదాయించే ప్రయత్నం చేశారు. బీటీ రోడ్డు వేస్తేనే తమ గ్రామం నుంచి లారీలు తిప్పాలని గ్రామస్థులు స్పష్టం చేశారు.